# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 03-10-2023 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రామగుండంలో ఎన్టీపీసీ 6 వేల కోట్ల రూపాయలతో చేపట్టిన విద్యుత్తు ప్రాజెక్టును ప్రధానమంత్రి నరేంద్రమోదీ జాతికి అంకితం చేశారు.
- ❖ ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం అందించాలన్నదే "జగనన్న ఆరోగ్య సురక్ష పథకం" ప్రధాన లక్ష్యమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని అన్నారు.
- ❖ స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు క్వాష్ పిటిషన్‌పై విచారణను వచ్చే సోమవారానికి సుప్రీం కోర్టు వాయిదా వేసింది.
- ❖ అల్పపీడన ద్రోణి కారణంగా ఆంధ్రప్రదేశ్, యానంలో రానున్న మూడు రోజుల్లో ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపింది.
- ❖ పుణ్యక్షేత్రాల సందర్శనకు పిల్లలతో వచ్చే భక్తులు వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి సూచించారు.

====================

రాష్ట్రాలు, జిల్లాలు, గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఛత్తీస్‌గఢ్ పర్యటనలో భాగంగా 26 వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు ఈ రోజు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జగ్దల్ పూర్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడుతూ, 2014తో పోలిస్తే రైల్వే ప్రాజెక్టుల అభివృద్ధికి దాదాపు 20 రెట్లు బడ్జెట్ పెంచామని చెప్పారు. అనంతరం తెలంగాణలోని నిజామాబాద్ జిల్లాలో పర్యటించిన ప్రధాని 8 వేల కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. రామగుండంలో ఎన్టీపీసీ 6 వేల కోట్ల రూపాయలతో చేపట్టిన విద్యుత్తు ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు. మనోహరాబాద్ - సిద్దిపేట రైల్వేలైన్‌ను ప్రారంభించారు. బీబీనగర్‌లో ఎయిమ్స్‌ను నిర్మిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా నరేంద్ర మోదీ మాట్లాడుతూ, దేశంలో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చామని పేర్కొంటూ..

(వాయిస్ 30 సెకన్లు)

====================

ప్రతి ఇంటి ఆరోగ్యంపట్ల శ్రద్ధ తీసుకునే బాధ్యతను ప్రభుత్వం తీసుకుందని, "జగనన్న ఆరోగ్య సురక్ష పథకం" ప్రధాన లక్ష్యం అదేనని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని అన్నారు. విశాఖపట్నంలో "జగనన్న ఆరోగ్య సురక్ష" వైద్య శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లిఖార్జున, పలువురు వైద్యాధికారులు సమక్షంలో మహిళలతో మాట్లాడి, వారి ఆరోగ్య పరిస్థితిని ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 45 రోజుల పాటు 10 వేల 575 క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ప్రతీ గ్రామంలో సేవలు అందిస్తున్నామన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కింద జరిగే వైద్య సేవలకు అవసరమైతే, పాఠశాలలను కూడా ఉపయోగించుకుంటామని మంత్రి పేర్కొంటూ.....

(వాయిస్ 30 సెకన్లు)

అనంతరం ఆనందపురం మండలం శోంఠ్యాంలో 6.67 కోట్ల రూపాయలతో నిర్మించనున్న ఆయుర్వేద మందుల గిడ్డంగి, ఔషధ పరీక్షల ప్రయోగశాలకు మంత్రి శంఖుస్థాపన చేశారు.

====================

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రెండు రోజుల పర్యటన నిమిత్తం ఈనెల 6వ తేదీన ఢిల్లీకి వెళ్లనున్నారు. ఈ పర్యటనలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రులతో ముఖ్యమంత్రి భేటీ అయి, రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ ప్రాజెక్టులు, నిధుల విషయమై చర్చించనున్నట్టు అధికారవర్గాలు తెలియజేశాయి. వివిధ సమస్యలపై పలువురు కేంద్ర మంత్రులతో కూడా ఆయన చర్చించనున్నారు.

====================

ఎలక్ట్రిక్ డిటోనేటర్ల తయారీ, వీటిని కలిగి ఉండటం, దిగుమతులు చేసుకోవడంపై నిషేధం విధిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. భద్రతాపరమైన ఆందోళనలు, ప్రజల భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్టు పారిశ్రామిక, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం పేర్కొంది. నిషేధంతో ప్రజా భద్రతకు ప్రయోజనకరమని పేర్కొంటూ ఓ ప్రకటన విడుదల చేసింది. 2024-25 చివరి నాటికి వీటి ఉత్పత్తిని పూర్తిగా నిలిపివేయాలని నిర్ణయించినట్టు కేంద్రం తెలిపింది. ఎలక్ట్రిక్ డిటోనేటర్లపై నిషేధం 2025 ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వస్తుందని స్పష్టం చేస్తూ ప్రకటనలో పేర్కొంది.

====================

చిన్నపిల్లలతో తిరుమలకు వచ్చే భక్తులు అప్రమత్తంగా ఉండాలని తిరుపతి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ పరమేశ్వరరెడ్డి విజ్ఞప్తి చేశారు. తిరుపతి బస్టాండ్ లో కిడ్నాప్ కు గురైన చెన్నైకు చెందిన చంద్రశేఖర్ రెండేళ్ల కుమారుడు మురుగన్ ను తల్లిదండ్రులకు ఈరోజు ఆయన అప్పగించారు. తిరుపతి అవిలాలకు చెందిన సుధాకర్ తన అక్క ధనమ్మకు పిల్లలు లేకపోవడంతో చిన్నారిని కిడ్నాప్ చేశాడని ఎస్పీ తెలిపారు. పుణ్యక్షేత్రాల సందర్శనకు పిల్లలతో వచ్చే భక్తులు వారి పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని ఎస్పీ సూచించారు.

====================

స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సుప్రీ కోర్టులో దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణ వచ్చే సోమవారానికి వాయిదా పడింది. హైకోర్టులో సమర్పించిన పత్రాలన్నీ సోమవారంలోపు సమర్పించాలని సీఐడీ తరఫు న్యాయవాదిని సుప్రీం కోర్టు ఆదేశించింది. ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ పై కూడా హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది. ఇదే కేసులో టీడీపీ యువనేత నారా లోకేశ్ దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. అక్టోబరు 10న సీఐడీ విచారణకు లోకేశ్ హాజరు కావాలని ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = =

రక్షణ పరికరాల ఉత్పత్తిలో భారతదేశం స్వావలంబన దిశగా ముందడుగు వేస్తోంది. అంతేకాకుండా ప్రధాన ఎగుమతిదారుగానూ ఎదుగుతోంది. ఒకప్పుడు రక్షణ పరికరాల కోసం దిగుమతులపైనే ఆధారపడిన భారత్, గత 9 ఏళ్లలో కేంద్రప్రభుత్వం తీసుకున్న చర్యలవలన ఎగుమతిదారుగా మారింది. రక్షణ రంగంలో చేపట్టిన సంస్కరణలతో సత్ఫలితాలు ఇస్తున్నట్లు ఇది రుజువు చేస్తోంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటిదాకా 15 వేల 920 కోట్ల రూపాయల విలువైన ఎగుమతులతో సరికొత్త రికార్డు సృష్టించింది. ఇది 2016 - 17తో పోలిస్తే 10 రెట్లు ఎక్కువ. దీనిపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పందిస్తూ, 'మేక్ ఇన్ ఇండియా' విజయంలో భారత ప్రతిభ, ఉత్సాహాలకు ఇది సుస్పష్ట నిదర్శనమని పేర్కొన్నారు. దేశాన్ని రక్షణ ఉత్పత్తుల కూడలిగా మార్చడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఈ కార్యక్రమానికి ప్రభుత్వ చేయూత కొనసాగుతుందని తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = =

మత్సకారులకు ఉపాధి చూపేందుకే ఫిష్ ఆంధ్రా స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం జిల్లా పొన్నాడలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్రా స్టాల్ ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, స్వచ్ఛమైన చేపలను పౌరులకు అందించాలనే సంకల్పంతో ఫిష్ ఆంధ్రాకు రూపకల్పన చేశామన్నారు. వేటకు వెళ్ళి చనిపోయిన మత్యకారులకు 10 లక్షల రూపాయలను పరిహారం కింద అందిస్తున్నామని, అర్హులకు డీజిల్ సబ్సిడీ అందిస్తున్నట్లు తెలియజేశారు. ఎచ్చెర్ల నియోజకవర్గం బుడగుట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ పనులు జరుగుతున్నాయని, ఈ పనులు పూర్తయితే ఉపాధి నిమిత్తం జిల్లా వాసులు వలస వెళ్లాల్సిన అవసరం ఉండదని మంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

నైరుతి జార్ఖండ్, ఉత్తర ఛత్తీస్‌గఢ్‌కు ఆనుకుని ఉన్న అల్పపీడన ప్రాంతం ఉపరితల ఆవర్తనంతో విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలియజేసింది. దక్షిణ జార్ఖండ్ నుండి ఒడిశా, ఛత్తీస్‌గఢ్ మీదుగా తెలంగాణ వరకు ద్రోణి కొనసాగుతోందని, ఆంధ్రప్రదేశ్, యానంలో దిగువ ట్రోపో ఆవరణంలో వాయవ్య, పడమటి గాలులు వీస్తున్నాయని పేర్కొంది. దీని ప్రభావంతో రానున్న మూడు రోజులలో ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, రాయలసీమ, యానాంలలో తేలిక పాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు అనేక చోట్ల కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = =

వచ్చే ఏడాది మార్చిలో నిర్వహించే ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరయ్యే ప్రైవేటు విద్యార్థులకు హాజరు మినహాయింపునిస్తూ.. ఇంటర్ విద్యామండలి ఆదేశాలు జారీ చేసింది. దీని కోసం నవంబరు 30వ తేదీలోపు 1,500 రూపాయల ఫీజు చెల్లించాలని సూచించింది. అపరాధ రుసుము 500 రూపాయలతో డిసెంబరు 31వ తేదీ వరకు ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు ఇంటర్ బోర్డు అధికార వర్గాలు తెలియజేశాయి.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశ రాజధాని ఢిల్లీలో నేడు రెండు సార్లు భూప్రకంపనలు సంభవించాయి. మొదట రిక్టర్ స్కేలుపై 4.6 తీవ్రతతో భూప్రకంపనలు సంభవించగా, రెండోసారి నేపాల్ భూకేంద్రంగా రిక్టర్ స్కేలుపై 6.2 తీవ్రతతో ప్రకంపనలు వచ్చాయి. ఈ ప్రకంపనలతో కార్యాలయాలు, ఇళ్ల నుంచి ప్రజలు బయటకు పరుగులు తీశారు. ఢిల్లీతో సహా పంజాబ్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో 40 సెకన్ల పాటు భూప్రకంపనలు సంభవించాయి. మధ్యాహ్నం 2 గంటల 25 నిమిషాలకు మొదటి భూకంపం సంభవించినట్లు, భూకంప కేంద్రం నేపాల్‌కు సమీపంలో ఉన్నట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ స్పష్టం చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

రేపటి నుంచి 10వ తేదీ వరకు అరసవిల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి దేవస్థానం ధర్మ ప్రచార వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు దేవస్థానం కార్యనిర్వనాధికారి వి.హరి సూర్యప్రకాశ్ తెలియజేశారు. ప్రచార వారోత్సవాల నిర్వహణకు సంబంధించి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = =